# తనిఖీ

ఉదయం ఏడు గంటలయింది...

అప్పటికే ఆలస్యం అయిందేమోనని ఆత్రంగా బట్టలు వేసుకుని ఆఫీసుకు చేరుకున్నాను. అప్పటికే స్టాఫంతా వచ్చేసి ఎవరిపనుల్లో వాళ్లు మునిగిపోయి వున్నారు. మా ఎమ్మార్వో ఆఫీసు గదిలో కూచుని ఏదో ఫైలు చూస్తూ వున్నారు.

'గుడ్‌మాణింగ్‌సార్' అన్నాను.

ఫైలులోంచి నావేపు చూపు మరల్చి "వెరీగుడ్ మోణింగ్" అన్నారు చిరునవ్వుతో.

ఆఫీసరు నవ్వారంటే మనసంతా హాయి అయిపోతుంది ఏ ఉద్యోగికయినా... అదే నాకూ అయింది.

మామూలుగా ఆఫీసరంటే కొంత భయం వుండి తీరుతుంది ఎవరికైనా. మా స్టాఫు అదృష్టం ఏమోకానీ మా ఆఫీసరంటే మాకు ఎవరికీ ఏ భయమూ లేదు. అలా భయం లేకుండా వుండటానికి కారణం మా 'ఎమ్మార్వో' మంచితనమే!

సాధారణంగా 'ఆఫీసర్లంటే ఎప్పుడూ మొహం మాడుస్తూ చీటికీ మాటికీ కోపగించుకుంటూ చీవాట్లేస్తూ, ఫైళ్లు పుటప్ చేస్తూనే... పిచ్చుకపై బ్రహ్మాస్త్రాన్ని సంధించినట్టు చిరు గుమాస్తా ఫైళ్లమీద నూరు కొర్రీలు వేస్తూ, అయినదానికీ, కానిదానికీ కేకలువేస్తూ, ఏ గుమాస్తా అయినా ఏదైనా అవసరం కలిగి సెలవు అడిగాడా – వినిపించేట్టు మూడు తిట్లూ, వినిపించకుండా నూరు తిట్లూ గొణిగేస్తూ, వేపకాయ అప్పుడే కొరికినట్టు మొహం చిట్లిస్తూ, ఇంక్రిమెంట్లూ, పండగ అడ్వాన్సులూ, ఆరియర్ బిల్స్ లాంటివి మంజూరు చేయాల్సివస్తే తన యావదాస్తినీ శత్రువుకు రాసి ఇచ్చేస్తున్నట్టు యమయాతనతో మంజూరు చేసే వాళ్లే ఎక్కువమంది! అలాంటి ఆఫీసర్లని నా సర్వీసులో చాలామందినే చూశాను. అయితే మా 'ఎమ్మార్వో' మాత్రం చాలామంది ఆఫీసర్లకి భిన్నం! నవ్వుతూనే అన్ని పనులూ చేయిస్తారు స్టాపుతోటి. ఆయనకి 'కోపం'. అన్న పదం ఒకటి వుందని తెలుసా అని నా అనుమానం! మా 'ఎమ్మార్వో' మంచితనం ఎక్కడ దెబ్బతింటుందోనని స్టాపుకూడా పనులు చేయడంలో వెనకాడదు.

"టిఫెన్ చేశారా సార్!" అడిగాను.

"ఊ... చేశాను... నువ్వూ?"

"చేశాను సార్!"

"సర్వేయరు ఇంకా రాలా!"

"వచ్చినట్టు లేదు సార్!"

"వస్తాదులే... పాపం కొంచెం వయసు మనిషి కదా..."

"జేసీ గారి ప్రోగ్రాం ఎన్నింటికి సార్?"

"ప్రోగ్రాం ప్రకారం ఎనిమిదిన్నరకే వస్తారట... యిప్పుడే ఫోన్ వచ్చింది."

"సార్... ఆర్‌డిఓ గారూ!"

"ఎనిమిదింటికే వస్తారట!"

ఇద్దరు పై అధికార్లు (జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఓ) కలిసి రావడం నేను 'ఆర్ఐ'గా చేరిన రెండు నెలల్లో ఇదే మొదటిసారి. అట్లా ఉన్నతాధికార్లు రావడానికి కారణం వుంది. అదేమిటంటే రెండేండ్ల క్రితం మా మండలంలోని చింతమానిపల్లె గ్రామంలో భూమిలేని షెడ్యూల్డు కులాల వారికి వ్యవసాయం చేసుకోడానికి గానూ భూమి ఇవ్వాలని ప్రభుత్వం వారు సంకల్పించారు. అయితే, ఆ గ్రామానికి భూమి అసైన్‌మెంటు చేయడానికి గానూ బంజరు భూములూ, పోరంబోకు భూములూ ఏవీ లేనందున ఓ నూటా అరవై ఎకరాల భూమిని ఏ భూస్వామి వద్దనైనా భూసముపార్జన క్రింద కొనుక్కోవాలని అనుకుంది ప్రభుత్వం. 'ఎవరిస్తారా' అని ప్రభుత్వం అడిగీ అడగకముందే మా నియోజకవర్గం మంత్రిగారి తండ్రిగారయిన శ్రీనివాసులుగారు 'టపీ'మని నేనిస్తానంటూ ముందు కొచ్చేశారు. రావడమేమిటీ... నూటా అరవై ఎకరాల భూమిని ఇవ్వడానికి సన్నద్ధమైనట్టూ రాత మూలకంగా తెలియజేయడం ఏమిటీ అన్నీ ఓ నెలలోనే జరిగిపోయాయి!

అయితే ప్రభుత్వ నిబంధనల మేరకు ఆ భూమి వ్యవసాయం చేసుకోవడానికి యోగ్యమైనదంటూ 'ఎమ్మార్వో' రిపోర్టు యివ్వాలి. అప్పట్లో రాజకీయంగా శ్రీనివాసులుగారు ఏం మాయచేసి, ఏం పలుకుబడి వుపయోగించారో, ఏమిటో అధికార్లచేత 'నూటా అరవై ఎకరాల భూమి వ్యవసాయానికి యోగ్యమైనదేనంటూ రాయించారు.' కొద్దిరోజుల్లోనే కొన్ని లక్షలు తన ఒళ్లో రాల్తాయనుకున్నారు.

మనం వుంటోంది ప్రజాస్వామిక దేశం అని ఎప్పుడు, ఎక్కడ మరిచిపోతామోనని మన రాజకీయ నాయకులకి ఒకటే అనుమానమేమో మరి. అందువల్లనే ఏదో సంచలనం సృష్టిస్తూవుంటారు. అలాంటి సంచలనంలో భాగంగానే అధికార పార్టీలో పెద్దఎత్తున మార్పులు జరిగాయి. దాంతో మంత్రిగారు కాస్త మాజీ మంత్రిగారయిపోయారు. అక్కడితో 'భూసముపార్జన' ఫైలు తాత్కాలికంగా పెండింగులో వుండిపోయింది.

డెమొక్రసీని ప్రజలు మళ్లీ మరుస్తున్నారని అనిపించిందో ఏమిటో... ఈసారి ఎన్నికలు జరిగాయి. అక్కడితో మాజీ మంత్రిగారు తిరిగీ తన స్థానాన్ని నిలబెట్టుకొని మళ్లీ మంత్రి పదవిని అధిష్ఠించారు.

ఈలోగా పాత 'ఎమ్మార్వో' బదిలీ అయి, కొత్త 'ఎమ్మార్వో' రావడం. ఎవరో పెట్టిన పిటీషనుతో మళ్లీ భూసముపార్జన ఫైలు ప్రాణం పోసుకుంది. కొత్త 'ఎమ్మార్వో' ఆ నూటా అరవై ఎకరాల భూమినీ తనిఖీ చేసి 'అది వ్యవసాయానికి ఏ మాత్రం పనికిరాదని' తేల్చేసి, రిపోర్టు రాసేసి పై అధికార్లకి పంపించేశారు. అంతే! ఆ ఫైలు వ్యవహారాన్ని చూసిన జాయింటు కలెక్టరు "వరేవరే ఇదేదో గొప్ప తిరకాసు వ్యవహారంలా వుందిరా, దీని అంతుచూసి తీరాలి" అని అనుకున్నారులా వుంది. తామే స్వయంగా తనిఖీ చేస్తాము అంటూ ట్యూర్ ప్రోగ్రాంలో డేట్ ఫిక్సచేసి మరీ పంపారు. అందుకే ఉదయమే ఆఫీసు పని చేస్తున్నది!

సర్వేయరు రానే వచ్చారు. 'మీరు ఎఫ్ఎమ్‌బి (ఫీల్డు మెజర్‌మెంటు బుక్) విలేజ్ ప్లాన్, తీసుకొని రెడీగా వుండండి సార్!' చెప్పారు ఆయనకి, ఎమ్మార్వో.

ఎనిమిది అవుతున్నట్టే ఆర్‌డిఓ వచ్చేశారు. ఆయన టిఫెన్ చేసి సిగరెట్టు కాలుస్తుంటే జాయింటు కలెక్టరు కారు వచ్చేసింది. గబగబ సిగరెట్టుని ఆర్పేసి 'జేసీ'ని స్వాగతించడానికి కారుదగ్గరకు వెళ్ళారు ఆర్‌డిఓ. ఆయన వెంట మా 'ఎమ్మార్వో'.

'జేసి' ఓ తరహా మనిషి! ఆయన ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడరు. మహా అయితే చిరుమందహాసం చిందిస్తారు అంతే! సన్నగా పొడుగ్గా, ఎర్రగా వుంటారు. వయసు ముప్ఫయినాలుగు వుండవచ్చు.

టకటకా అడుగులువేస్తూ 'ఎమ్మార్వో' ఆఫీసు గదిలోకి వచ్చి కూచున్నారు. ఒక్క క్షణం అలా నిశ్శబ్దంగా కూచున్నారో లేదో "ఎమ్మార్వో గారూ, ఆర్‌డిఓ గారూ మనం ఫీల్డు ఇన్‌స్పెక్షన్‌కు వెళ్దామా?" అన్నారు ఇంగ్లీషులో కుర్చీలోంచి పైకి లేస్తూ.

"తప్పకుండా సార్!" ముక్తకంఠంతో ఠక్కున ఇద్దరు అధికార్లూ.

"ఇక్కడికీ ఎంత దూరం వుంటుందీ... చింతామానిపల్లె" అన్నారు 'జేసి' హిందీ యాసలో వున్న తెలుగులో.

ఆయన అలా యాసగా మాట్లాడినా, హిందీ వాడయ్యుండీ తెలుగు మాట్లాడ్డం నాకు చాలా బాగా అనిపించింది.

"ఏడు కిలోమీటర్లు వుంటుంది సార్! తర్వాత ఊరవతలకెళ్లాక ఒక కిలోమీటరు దూరం మాత్రమే దారుంది సార్! అక్కడినుంచి రెండు కిలోమీటర్లు దూరం కాలినడకనే వెళ్లాలి సార్!" అన్నారు ఎమ్మార్వో.

"కనీసం 'బులక్ కార్టు' అయినా అరేంజి చేయరా?" అన్నారు ఆర్‌డిఓ ఎమ్మార్వో వుద్దేశించి.

"ఎద్దులబండి వెళ్ళడానికి అనువుగా లేదు సార్ దారి" అన్నాను.

ఎమ్మార్వో, నేనూ సర్వేయర్లూ, విలేజి అసిస్టెంటూ అందరం ఆర్‌డిఓ జీపులో బయల్దేరాం.

'జేసి' కారులో బయల్దేరారు.

❁ ❁ ❁ ❁

చింతమానిపల్లె చేరుకున్నాం.

అప్పటికే మంత్రిగారి తండ్రిగారు అక్కడ జీపులో మాటువేసి వున్నాడు!

'జేసీ' ఉన్న చోట్నించే ఓ నమస్కార బాణం వదిలాడు శ్రీనివాసులు. సదరు బాణాన్ని 'జేసీ' రిసీవ్ చేసుకున్నారో లేదో తెలీదు కానీ, కారు మాత్రం కొంత స్పీదు తగ్గించి మళ్లీ స్పీదు అందుకుంది.

కారు వెంట మా జీపు, మా వెనకాల శ్రీనివాసులుగారి జీపు వస్తోంది.

ఊరి బయటికి ఒక కిలోమీటరు దూరం చేరుకున్నాక అక్కడ వాహనాలను ఆపేసి అందరం నడక సాగించాం.

'జేసీ' వడివడిగా అదుగులేస్తున్నారు. అతనితోపాటు నడవాలంటే నాకే చేతకాకుండా పోతోంది! నేను పరుగులాంటి నడక ప్రారంభించాను. తక్కిన వాళ్లంతా వయసు మీద పడ్డవాళ్ళు కావడంచేత మాతోపాటు రాలేకపోయారు.

ఓ అరగంట తర్వాత 'జేసీ' తనిఖీ చేయాల్సిన 'ఫీల్డు' చేరుకున్నాము. అది సర్వే భాషలోనూ, ఇంగ్లీషు భాషలోనూ 'ఫీల్డు' అవుతుందేమో కానీ తెలుగులో మాత్రం 'పొలం' అవదు. దానికి ఏ కోశానా వ్యవసాయానికి అర్హమయిన ఎటువంటి లక్షణాలూ లేవు. నూటా అరవై ఎకరాల నేలలో అరవై సెంట్లు భూమి కూడా మామూలు నేలలా లేదు. అంతా రాతిగుట్టలూ... వట్టి ముండ్ల తుప్పలూ, దాన్ని ఒకవేళ గవర్నమెంటు తీసుకొని ఏ లబ్ధిదారుడికైనా యిస్తే, ఇక అతను ఈ జన్మకే కాదు ఏ జన్మకీ ఆ భూమిలో పంట పండించలేడు. దాన్ని వ్యవసాయం చేయడానికి 'మంచి రైతు' కాదు కావలసింది, "ఓ మాయల మరాఠీ!!". అతనైతే "హాంఫట్... క్రీం... ట్రీం..." అంటూ ఓ మంత్రం వేసేసి రాతిగుట్టల్నీ, ముండ్ల తుప్పల్నీ మాయం చేసేయగలడు!

"మిస్టర్ ఆర్ఐ ఇదేనా ఫీల్డు?" అడిగారు 'జేసీ'

"యస్‌సార్!" అన్నాను.

"మీకు సరిగ్గా తెలుసా?"

"తెలుసు సార్" అంటూ భుజానికి తగిలించుకొని వున్న సంచినుంచి యఫ్.యమ్.బి. తెరిచి జేసీ మేము నిలుచుని వున్న సర్వే నెంబర్నీ, దాని పక్కన వున్న సర్వే నెంబర్లనీ చూపాను. ఆయనకి నమ్మకం కలిగించడానికి "నేనూ, సర్వేయరు నిన్నటిరోజు ఇక్కడికొచ్చాం సార్... అదిగో సార్! ఫ్లాగ్స్‌కూడా నాటించాము!" అంటూ అక్కడక్కడ వున్న ఫ్లాగుల్ని చూపించాను.

నూటా అరవై ఎకరాల భూమిలోనూ మూలమూలల్లోనూ తిరిగారు ఆయన. అంతసేపూ ఆయన కనుబొమలు ముడిచేవున్నాయి.

"ఆర్ఐగారూ! ఈ ఫీల్డు కల్టివేషన్‌కు పనికివస్తుందంటారా? మీ అభిప్రాయం చెప్పండి!" అడిగారు ఆయన నా కళ్లలోకి సూటిగా చూస్తూ.

"ఏ మాత్రం పనికిరాదు సార్!"

"మరి ఇటువంటి భూమిని మనం అక్వయరు చేయడం... దీన్ని భూమిలేని పేదలకు ఇవ్వడం బావుంటుందా?"

"ఎట్లా బావుంటుంది సార్!" అన్నాను.

"కరెక్టే... మరయితే మనం దీన్ని అక్వయరు చేయడంవల్ల ఎవరికీ లాభం" అన్నారాయన చుట్టూ పరిసరాల్ని పరిశీలిస్తూ.

"భూకామందుకు లాభం సార్!"

"అవును... అందుకే భూకామందు కూడా మంచి భూమిని తనకే వుంచుకుని, పనికిరాని చెత్తభూమిని ప్రభుత్వపరం చేస్తున్నాడు. అదిసరే... ఇది వ్యవసాయానికి యోగ్యమైన భూమిగా ధ్రువపరిచింది మీ 'ఎమ్మార్వో'గారేగా... మీరిచ్చిన రిపోర్టును ఆధారం చేసుకొనే అట్లారాసి వుంటాడు అవునా!" అన్నారు 'జేసీ' ఓరకంట నన్ను చూస్తూ.

"నేను కొత్తగా వచ్చాను సార్! నాకు ఈ విషయం తెలీదసలు! ఎమ్మార్వోగారు కూడా మారారు. ఇప్పుడున్న ఎమ్మార్వోగారే సార్ ఈ భూమిని 'వ్యవసాయ యోగ్యమైన భూమికాదు' అంటూ మీకు రిపోర్టు యిచ్చింది.

"యస్... యస్... ఐ అండర్‌స్టాండ్ యువర్ పాయింట్... ఇదంతా జరిగింది రాజకీయ గారడీవల్ల" అంటూనే నా వేపు చూశారు. తల ఆడించాను అవునన్నట్లు.

గిరుక్కున వెనక్కి తిరిగి, రావడం ఎంత వేగంగా వచ్చారో అంతే వేగంతో తిరుగుముఖం. వెనక వురుకుల పరుగులతో నేను.

కనుచూపు మేరలో ఆర్‌డిఓ, ఎమ్మార్వో వస్తున్నారు. మమ్మల్ని చూసి ఆగిపోయారు.

మేము దగ్గరవుతున్నట్టే...

"మీతో పాటూ నడవలేకపోయాం సార్!" అన్నారు ఆర్‌డిఓ.

"దాన్దేముంది లెండి... మీ వయసు వస్తే నేనూ అంతేనేమో" ఇంగ్లీషులో అనేసి నవ్వేశారు 'జేసీ'.

అందరం బయల్దేరాం...

❁ ❁ ❁ ❁

భూమి గుండ్రంగా వుందన్నట్టు తిరిగి అందరం మండల కార్యాలయం చేరుకున్నాం.

మాతో పాటూ శ్రీనివాసులు కూడా వచ్చారు.

"ఏం సార్! భూమి విషయం ఏమన్నారు 'జేసీ'గారు' అనడిగారు నన్ను.

"ఏమోనండీ నాకేం తెలుసు... పెద్దవాళ్ళు మాలాంటి వాళ్లతో ఏ విషయమైనా ఎందుకు చెబుతారు?" అంటూ తప్పుకున్నాను.

"ఆ... ఏముందిలే... తన రిపోర్టులో మా భూమి వ్యవసాయ యోగ్యమైందని రాయాల్సిందే... లేకుంటే యిడుస్తానా?"

'జేసీ'గారు... ఎలాంటి వారో మీకూ తెలుసుననుకొంటాను" అన్నాను పరోక్షంగా అతని నమ్మకంమీద దెబ్బకొట్టాలని.

"ఆ... చూసినానులేప్పా! ఎంత పెద్దవాళ్ళయినా లచ్చుమక్క చేతిలో పడిందిరా అంటే ఇక కలం పుల్ల మనం ఎట్లరాయమంటే అట్ల రాయాల్సిందే..." అంటూనే 'జేసీ' వున్న గదిలోకి వెళ్ళాడు శ్రీనివాసులు.

'భోజనాలు తొందరగా తయారు అయ్యేలా చూడు' అంటూ మా 'ఎమ్మార్వో' నాకు పని పురమాయించడంతో అక్కడినించి వెళ్లాను.

ఓ అరగంట తర్వాత తిరిగి ఆఫీసుకు వచ్చేటప్పటికి శ్రీనివాసులుగారు మొహాన్ని దుమదుమలాడించుకుంటూ వచ్చారు.

"పిల్లోల్లంతా జేసీలయితే ఇంతే మరి. అర్ధగంట కూకొని నా పరిస్థితి అంతా వివరించినా... ఊహూ... వినడే... ఎవుడో భూమిలేని పేదనాకొడుక్కి మంచి భూమి యియ్యాల్లంట... మా ద్రాక్ష తోట గీన రాసిచ్చేదా? ఏమీ నా భూమిలో రాళ్లూ రప్పలూ పెరికేసి దున్నేసుకోలేరా ఆ నా కొడుకులు. ఆ మాటే అంటే వప్పుకోడే మీ 'జేసీ', నా భూమి తీసుకొనేదానికి. గవుర్నమెంటోడు గదా దుడ్లిచ్చేది. ఈయన జేబులోనించి తీసి అబ్బగంటేమన్నా ఇస్తాడో! అధికారమంతా నాకే వుంది గదా అని బొలే మిడిసిపడేది... ఇట్లా వాళ్ళని దండిగ జూసినా. ఇద్దో నా తలకాయమీద ఎన్ని ఎంటికలుండాయో అన్ని!" అంటూ గొణుక్కుంటూ వెళ్లిపోయాడు శ్రీనివాసులు.

'జేసీ' ఆయనకి ఏం సమాధానం చెప్పి వుంటారో ఊహించాను.

ఓ వారం తర్వాత ఆఫీసులో ప్రత్యక్షమైనాడు శ్రీనివాసులు. 'చూడు నా తఢాకా మీ 'జేసీ'ని ట్రాన్స్‌ఫర్ చేపిచ్చినా... ఏమనుకుండావో...' అన్నాడు.

అతను అన్నట్టుగానే మరసటిరోజుకే 'జేసీ' బదిలీ అయిపోయారు హైదరాబాదుకు.

నా మనసులో ఏదో నిర్వేదం! ఈ వ్యవస్థ మీద...!!

• ఆం.ప్ర. రెవిన్యూ సావనీర్ - *1991* •

• *8వ* రాష్ట్ర సదస్సు •